క్లుప్తంగా

19న వైద్య శిబిరం



కరపత్రం ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డులో గల స్టార్ హాస్పిటల్‌లో ఈనెల 19వ తేదీన తాటికొండ జానకిరాంరెడ్డి సౌజన్యంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుండె, ఎముకల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి తెలిపారు. సోమవారం పట్టణంలో వైద్య శిబిర కరపత్రం, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, గాట్ కోఆర్డినేటర్ గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, సైదిరెడ్డి, కె.శ్రీనివాస్, విశ్వనాథ్, నీలా శ్రీనివాస్, సైదులు, లక్ష్మారెడ్డి, రామ్మూర్తి, సైదయ్య, బికోజి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంద్రారెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని గ్రామ పంచాయతీల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డీపీఓ నారాయణరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల రెవెన్యూ గెజిట్ గురించి అధికారులతో ప్రస్తావించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే గ్రామాలను సందర్శించి సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సీతారాంపురం కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతూ గ్రామంలో రాజకీయం చేస్తున్నాడని విచారణ జరిపి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చే వారి వద్ద నుంచి లంచం తీసుకొని పనులు చేస్తున్నాడని, గ్రామ పంచాయతీ ఆదాయ, ఖర్చులకు సంబంధించి తప్పుడు లెక్కలు చూపుతున్నాడని, ప్రశాంతగా ఉన్న తమ గ్రామంలో పార్టీల నాయకుల మధ్య గొడవలు పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ పల్లా ఉపేందర్, గ్రామస్తులు సూరి, అజయ్, పిల్లుట్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల ముస్లిం మైనార్టీ నూతన కార్యవర్గాన్ని మౌలానా అబ్దుల్ ఖాదర్ సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ ఖాదర్ పాష, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే బాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె అబ్దుల్ ఆఫజ్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె అబ్దుల్ ఇస్తయక్, కోశాధికారిగా యూసుఫ్, గౌరవ సలహాదారులుగా పఠాన్ ఖాదర్‌ఖాన్, ఎస్‌కె మీరా, ఎస్‌కె ఇబ్రహీం, ఎస్‌కె రహీం, ఎస్‌కె ఖరీముల్లాను ఎన్నుకున్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు



నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

నడిగూడెం : తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అప్పులు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని, తమకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించాలని కోరారు. అరెస్టు అయిన వారిలో వట్టికూటి చంద్రయ్య, దొడ్డి నర్సింహారావు, జొన్నలగడ్డ వీరగోవిందు, కలకొండ పిచ్చయ్య, తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

- రూ.1.56 కోట్లతో భవన నిర్మాణం
- పనులు పూర్తయినా ప్రారంభించడంలో జాప్యం
- రూ.50 లక్షల బిల్లులు పెండింగ్
- భవనానికి తాళం వేసిన కాంట్రాక్టర్



మునగాలలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం



నూతన భవనానికి తాళం వేసిన కాంట్రాక్టర్

మునగాల : మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తయి ఐదారు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇదే ప్రాంతంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్‌అండ్‌బీ భవనంలో కొనసాగిన సివిల్ ఆస్పత్రిని కాలానుగుణంగా గ్రేడ్ తగ్గించి పీహెచ్‌సీగా మార్చారు. ఈ భవనం అసౌకర్యంగా ఉండడంతో ప్రభుత్వం నూతన భవనాన్ని అన్ని హంగులతో నిర్మించింది. కానీ భవనాన్ని ప్రారంభించేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భవనానికి తాళం !

కాగా, నూతన పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి సంబంధించి సదరు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.50 లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. అందుకు సంబంధించి ఎంబీ రికార్డులు కాకపోవడంతో కాంట్రాక్టర్ నేటికీ నూతన భవనాన్ని వైద్యారోగ్య శాఖకు అప్పగించకుండా తాళం వేసి ఉంచాడు. గత నెల రోజుల్లోనే జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం రెండుసార్లు పీహెచ్‌సీని సందర్శించి త్వరలోనే భవనం ప్రారంభిస్తామని చెప్పినా నేటికీ అతీగతీ లేదు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎంబీ రికార్డులను హైదరాబాద్ కార్యాలయానికి పంపించినట్లు, మిగిలిన చిన్నాచితక పనులు పూర్తయిన వెంటనే భవనాన్ని త్వరలో జిల్లా వైద్యారోగ్య శాఖకు అప్పగించనున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి..

స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని పీహెచ్‌సీ విషయాన్ని జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రారంభించేందకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాదాల్లో ఎంతో మంది క్షతగాత్రులు అవుతున్నారని, వారికి సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నందున ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయించేందుకు ఎమ్మెల్యే కృషిచేయాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీని నూతన భవనంలోకి మార్చాలి

పీహెచ్‌సీ భవనాన్ని త్వరితగతిన ప్రారంభించి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని అందులోకి మార్చాలి. భవనం ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తుంది. కావున స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, మునగాల

చిన్నాచితక పనులు మిగిలాయి

మునగాలలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తయింది. కాకపోతే చిన్నాచితక పనులు మిగిలాయి. ఎంబీ రికార్డులను హైదరాబాద్ కార్యాలయానికి పంపించాం. వర్క్‌డన్ కావాల్సి ఉంది. వారం రోజుల్లో చిన్న చిన్న మరమ్మతు పనులు పూర్తి చేసి వెంటనే భవనం ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం.

– వసంత, పంచాయతీరాజ్ ఏఈ, మునగాల

వైద్యారోగ్య శాఖకు అప్పగించలేదు

మండల కేంద్రంలో నూతన పీహెచ్‌సీ భవనం అన్ని హంగులతో పూర్తయింది. ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కాకపోతే ఈ భవనం పంచాయతీరాజ్ శాఖ నుంచి వైద్యారోగ్యశాఖకు రావాల్సి ఉంది. వారు నూతన భవనాన్ని తమ శాఖకు అప్పగించిన వెంటనే జిల్లా వైద్యాధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రారంభిస్తాం

– డా.రవీందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, మునగాల

రూ.50 లక్షల బిల్లులు రావాలి

మండల కేంద్రంలో పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం పూర్తయింది. చిన్నచిన్న పనులు మిగిలాయి. రెండురోజుల్లో పూర్తవుతాయి. ఎంబీ పూర్తయిన వెంటనే భవనాన్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తా. సుమారు రూ.50లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉంది.

– షేక్ గౌసుద్దీన్‌మియా, కాంట్రాక్టర్

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- రెండవ రోజు 44.99 శాతం హాజరు



కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కోదాడ : కోదాడ పట్టణ పరిధిలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రూప్– 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. రెండవ రోజు సోమవారం ఉదయం పేపర్– 3, సాయంత్రం పేపర్– 4 పరీక్షలు జరిగాయి. కోదాడ పట్టణంలో 16 సెంటర్లు, చిలుకూరు మండల పరిధిలో 2 సెంటర్లు, అనంతగిరిలో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. మొత్తం 19 సెంటర్లలో సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 7887 మందికి గాను 3549 మంది, సాయంత్రం పరీక్షకు 7887 మందికి గాను 3542 మంది హాజరయ్యారు. 44.99 శాతం అభ్యర్థులు పరీక్ష రాశారు. రెండు రోజులు పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించామని కోదాడ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్, కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బోల్ల సైదిరెడ్డి తెలిపారు.

సుబ్బరామయ్య సేవలు మరువలేనివి



సుబ్బరామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ అభివృద్ధికి సర్పంచ్‌గా చిట్టబత్తిని సుబ్బరామయ్య చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. సోమవారం సుబ్బరామయ్య వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుబ్బరామయ్య సర్పంచ్‌గా తన పదవి కాలంలో కోదాడను అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచనలేకుండా కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ ఏర్నేని వెంకటరత్నం బాబు, మందలపు శేషు, సాధినేని అప్పారావు, వరప్రసాద్, నరసింహారావు, శివరామయ్య, తొండపు సతీష్, బగ్దాద్, డేగ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మునగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా యాసంగి పంటలు –సస్యరక్షణ చర్యలు అనే అంశంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ బాబు

మఠంపల్లి : యువత క్రీడల్లో రాణించాలని మఠంపల్లి ఎస్‌ఐ పి.బాబు అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని అల్లీపురంలో ఇమ్మానియేల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికంగా గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఐను క్రీడాకారులు, నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇరుగు ప్రభు, భరత్, వీరారెడ్డి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాలధారణతో మానసిక ప్రశాంతత

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు సోమవారం అంతటి రమేష్ –సంతోషి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. మాలధారణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి రమేష్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ అన్నారు. సోమవారం మాధవరం గ్రామానికి చెందిన కోలమూరి ఆనంద్ –దేవీశ్రీ దంపతుల కుమారుడు వైష్ణవి పుట్టినరోజును పురస్కరించుకొని ఆశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో దాతలు, ఆశ్రమ సిబ్బంది వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక లెనిన్ నగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ప్రారంభమై సంవత్సరం దాటినా విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆయన అన్నారు. విద్యారంగానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేదని ఆయన తెలిపారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం విజయ్, వినయ్, మాతంగి విజయ్, వివేక్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



సిరికొండ-మోతె గ్రామాల మధ్య రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు



కూడలి నుంచి ఉర్లుగొండకు వెళ్లే సర్వీస్‌రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

- రహదారుల్లో కానరాని హెచ్చరిక బోర్డులు.. స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు

మోతె : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారుల్లోని మలుపులతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని మోతె-సిరికొండ, రావిపహాడ్ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో అతి ప్రమాదకరమైన 10మూలమలుపులు ఉన్నాయి. ఈ మూలమలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. హుస్సేన్‌బాద్– బుర్కచర్లకు వెళ్లే మార్గంతో పాటు, విభళాపురం నుంచి కరక్కాయలగూడెం, విభళాపురం నుంచి బుర్కచర్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఈ రోడ్లలో కొత్తగా వచ్చే వారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉర్లుగొండ నుంచి నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరడవాయి, గోపతండాకు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా మూలమలుపులు ఉన్నాయి.

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు..

మండల కేంద్రంతో పాటు బుర్కచర్ల నుంచి హుస్సేన్‌ఖాద్ గ్రామానికి వెళ్లే రహదారి, మోతె నుంచి సిరికొండ, సిరికొండ నుంచి రావిపహాడ్, కూడలి నుంచి రావికుంటతండా, కరక్కాయలగూడెం నుంచి మామిళ్లగూడెం గ్రామాలకు వెళ్లే రోడ్లలో అనేక మలుపులు ఉండడంతో ఈరోడ్లలో అను నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు..

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే సర్వీస్ రహదారుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతిచెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



హుజూర్‌నగర్ : శ్రీవేణుగోపాల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గోవుకు పూజ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



గరిడేపల్లి : పానుగోడులో పూజలు చేస్తున్న భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీగోదాదేవి అమ్మవారికి తిరుప్పావై సేవాకాలం చేపట్టారు. అనంతరం మహానివేదన గావించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, జోగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం గోపూజతో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో తొలుత గోమాతకు పూజలు నిర్వహించి ముమ్మారు దేవాలయ ప్రదక్షిణ గావించారు. విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, కంకణ ధారణ, అఖండ దీప ప్రజ్వలన తదితర వైదిక క్రతువులను అర్చకులు నిర్వహించారు. ఆలయంలో గోదాఅమ్మవారిని, వేణుగోపాలస్వామిని పట్టు వస్త్రాలు, పూలు, తులసిమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై పఠించారు. నీరాజనమంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాదాల గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు మురళీకృష్ణమాచార్యులు, రామకృష్ణమాచార్యులు, జగన్నాథచార్యులు, మోహనాచార్యులు, ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి, భక్తులు కోట సూర్యప్రకాష్‌రావు, గుండా రమేష్, నందయ్య, అశోక్, రామిశెట్టి రాము, కంచర్ల అరవింద్‌రెడ్డి, వంకాయల పద్మ, వెన్న పద్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో..

పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలోని శ్రీకృష్ణ, గోదాదేవి విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై పాశురాలను పఠించారు. అర్చకులు దామోదరాచార్యులు, పురుషోత్తమశర్మ, చైర్మన్ సోమలక్ష్మి, సుకన్య, లలిత, శైలజ, ఆండాలు, పద్మ, సుకన్య, సుగుణ, జ్యోతి, రమణమ్మ, భారతమ్మ, వెంకటరమణ, దుర్గ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో..

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోదాదేవికి కుంకుమ పూజ, సహస్ర నామార్చన, తిరుప్పావై సేవాకాలం, తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా, జనవరి 14 వరకు జరిగే ధనుర్మాస ఉత్సవాలకు ఆలయ ధర్మకర్త కీసర వినయవర్ధన్‌రెడ్డి సహకారంతో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి రమేష్, ఆలయ అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు, సురగాని వెంకన్న, ఆత్కూరి శ్రీను, పసుపులేటి రాంబాయమ్మ, రాయపూడి వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

గరిడేపల్లి : మండలంలోని పానుగోడులో గల వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొదటిరోజు తిరుప్పావై పఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూజారి కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సావాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు మొలుగు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఉపేంద్రశర్మ, వెంకటరమణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావై పారాయణం చేశారు. ఆలయ శాశ్వత ధర్మకర్త రాచకొండ రామచంద్రరావు, ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ రాంమోహన్‌రావు, ఎస్‌ఐ రవీందర్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, నాగమాధవరావు, కృపాకర్, రమేష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : మట్టపల్లిలో గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

బూరుగడ్డ ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివారాహ లక్ష్మీనరసింహ, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, గోదాదేవి అమ్మవారికి అభిషేకం, తిరుప్పావై సేవాకాలం ఆల్వార్లకు మంగళాశాసనం, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యరగాని గురువయ్య, ఈఓ లక్ష్మణ్‌రావు, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, గ్రామ పెద్దలు రాగంలింగయ్య, కనకయ్య, మల్లయ్య, గురువయ్య, లక్ష్మీనారాయణ, అనసూయమ్మ, పద్మ, ఎలమంచమ్మ, లక్ష్మి, నాగలక్ష్మి, నాగమణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు :మండల కేంద్రంలోని శ్రీగోదా భూనీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గోపూజ, నిత్యార్చన, తిరుప్పావై పాశుర విన్నపం నివేదన, మంగళ నీరాజనం మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు నరగిరినాథుని రంగభట్టారాచార్యులు, తరుణ్ దత్తు, కొంకపాక రాధాకృష్ణమూర్తి, శర్మ, నక్క కొండారెడ్డి, ఈఓ శంభిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : శ్రీకోదండ రామాలయంలో..



హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో పూజలో పాల్గొన్న భక్తులు



నడిగూడెం : సిరిపురంలో..

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, తదితరులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలను పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల ఎన్‌టీటీఎస్ డైరెక్టర్ అమరవరపు అబ్రహం హాజరై క్రీస్తు సందేశాన్ని బోధించారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు డి.అశోక్, ఉపాధ్యక్షుడు కె.జోసఫ్, కార్యదర్శి సాలమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాజు, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, శ్రీను, మందా భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన మహిళ పరిస్థితి విషమం

నడిగూడెం : ఓ వ్యక్తి చేసిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమంగా ఉంది. నడిగూడెం మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన లేళ్ల కేతమ్మ ఈ నెల 6న తన వ్యవసాయ భూమి వద్ద పని చేసుకుంటుండగా పక్క పొలానికి చెందిన లేళ్ల వెంకన్న గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అదే రోజు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నడిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని సోమవారం కుటుంబసభ్యులు తెలిపారు.